# అంతరాత్మ అంత్యక్రియలు

"ఏమిటీ ఘోరం ?" అడిగింది. అంతరాత్మ— అంతరాత్మ కళ్లుమూసుకుని కొంత అటూఇటూగా మూడేళ్లవుతోంది. యిన్నాళ్లుగా చూడక చూడక గభీ మని ఒక్కసారిగా చూడటంతో — కొంచెమేం ఖర్మ ? బాగానే గాభరాతిన్నది. ఆ గాభరాలో అలా అనేసింది.

ఐతే ... యీ మూడేళ్ళ మూతలోనించి అమాంతం బయటపడ్డ అంతరాత్మ గనుక అలా గాభరా తిన్నది. కాని ఆత్మకేమీ ? రోజూ అలాంటివి లక్షలు చూస్తూ అలవాటు పడిపోయింది. అందుకనే అంతరాత్మ అడిగిన ప్రశ్నను అలా ఖాతర్ చెయ్యలేదు.

బహుశా— అంతరాత్మ అడిగిన 'ఘోరం' ఆత్మకు వినపడ్డదో, లేదో కూడా.

ఆత్మ - ఈమధ్య చాలాకాలంనించీ వినేందు కూడా తీరికలేనన్ని ఉపన్యాసాలు, స్టేట్ మెంట్లూ అధికోత్పత్తి చేస్తూ సతం హతమై పోతోంది.

కాక... మూడేళ్లుగా ముక్కుమూసుకున్న అంతరాత్మ మాలుగే అలావుందో !

లేక... ఆత్మ, అధికార ... పూరిత బధిర శవంలా వుండి వినిపించుకోనేలేదో !

ఏది ఏమైనప్పటికీ—

"ఏమిటీ ఘోరం ?" మళ్ళీ అడిగింది. అంతరాత్మ.

"ఏమిటో ఘోరం !" ఎదురడిగింది. ఆత్మ

"ఇదే—"

"ఏది ?"

"యీ ఆకలి చావులూ..." చెప్పాకు పోబోతోంది. అంతరాత్మ—

"చావడానికి ఆకలే కారణమా ? సవాలక్ష కారణా లుంటాయి."

"ఆకలి మాత్రం ఎందుకు కారణం కాగూడదూ ?"

"అదీ-బాధ్యతారహితులు మాట్లాడేమాట. దురాశాపరులను రెచ్చగొట్టేవాడి మాట..." భగ్గు మన్నది ఆత్మ— పొడుగ్గా ఓ మూలుగు మూలిగింది. అంతరాత్మ

"ఆకలితో యీ దేశంలో ఒక్కడూ చావ లేదని స్టేట్ మెంట్లు యిచ్చాం. అంతే ! యిక యిప్పుడు

K. Pulla Reddy



అలా ఎవ్వరూ చావరు. అలా ఆకలి చావులని ఎవరూ అనరూ,అనకూడదు.''

"మరి యీ...హాహాకారాలు—?''

"అవా? అవీ....'' నీళ్ళు నమిలింది ఆత్మ. "అవీ... 'తిండి కొరత' అనీ—''

"మరి యీ తిండి కొరతకు ఏంచేస్తున్నట్టు?''

లంకించుకుంది. అంతరాత్మ

ఆత్మ ఒక్కసారి గుడ్లు పైకి తిప్పింది. కిందికి తిప్పింది. తెల్లటి టోపీతీసి టేబుల్ మీద పెట్టి కాస్సేపు గింజుకున్నది. చివరకు —

"దానికి చాలా గ్రంథం వుందిలే!'' అన్నది.

"భగవద్గీత అంతవుంటుందా?''

"భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లు కలిపితే దానికి మూడురెట్లు వుంటుంది.'' చెప్పింది ఆత్మ - యీ గొడవ తప్పించాలని.

"ఏదీ? మచ్చుకు కొంచెం...'' బతిమాలింది అంతరాత్మ - కుతూహలం కొద్దీనూ.

"కరువు తీరేందుకు రేషన్‌గింజల పరిమాణం తగ్గించేశాం'' చెప్పుకుపోతోంది ఆత్మ,

"అదీ-కరువును పంచడం అవుతుందిగాని, తీర్చడం అవుతుందా! మరి... ఆందోళన పెరగడం లేదూ?''

"ఆందోళన అరికట్టేందుకు, ప్రజారక్షణ చట్టం మాట అలావుంచి-ప్రతి-చోటా నిల్వలు 'నిండుకుని' వున్నట్టు ప్రకటిస్తున్నాం."

"ఆఁ !-అఁ ?" నోరు తెరిచింది. అంతరాత్మ

"విదేశాలనించి వచ్చే స్టీమర్లు ప్రకటించాం. వారానికి ఓపూట నిరాహార వుద్యమం లేవదీశాం. ఆకులు తినడంలోగల ఆరోగ్యం, గడ్డితినడంలోగల గట్టితనం, ప్రచారం చేశాం. చేయిస్తున్నాం."

అంతరాత్మ 'ఆ' కొట్టడంకూడా లేదు. చెవులు, నోరు, పళ్లూ, కళ్లూ, సర్వస్వంతో తెగవింటోంది.

"ఆకులకంటే గడ్డికంటేగూడా, గాలిమేస్తే యింకెంత ఆరోగ్యమో పరిశీలించేందుకు ఓ ప్రముఖుల కమిటీని వెయ్యాలని చూస్తున్నాం. ఆహారం పొదుపుకు గాను పెద్దపెద్దవాళ్ల తాలూకు భార్యలతో అఖిల భారత ఆడవాళ్ల సంఘాన్ని ఏర్పరిచాం-"

"వీటితో కరువు ఎలా తీరుతుంది ?" అంతరాత్మకు ధర్మసందేహం కలిగింది.

"మొదటే చెప్పాను. ఇది మహాగ్రంధమని" విసుగుకున్నది ఆత్మ-. అయినా బాధ్యతను గుర్తెరిగింది కనుక యింకా ఓపికతో-

"వీటివల్ల కరువు తీరదు కనుకనే అధికోత్పత్తి

S.S.L.C



సంఘాలూ, సలహాసంఘాలూనూ-''

ఐనా, అంతరాత్మకు సంతృప్తికలిగినట్టులేదు.

''పేడను పిడకలు చెయ్యగూడదని చెప్పాం. యింకా- ముఖ్యంగా...''

''స్వతంత్రం పొందిన మూడుసంవత్సరాలకైనా -మ్చ్'' అంతరాత్మ తల అడ్డంగా త్రిప్పింది.

''ఏమిటీ? మూడు సంవత్సరాలా? ఎవరన్నారు? భారతదేశం సర్వ స్వతంత్ర ప్రజాతంత్ర రిపబ్లిక్కై ఎన్నోనాళ్లుకూడా కాలేదు.'' నిప్పులు కక్కింది. ఆత్మ

అంతరాత్మ ఏమీ వాదించదలచుకున్నట్టు లేదు. మెల్లగా—

''పోనీ- జన సామాన్యానికి బంజర్లు పంచితే!'' అన్నది.

''పన్నులు చెల్లించడానికే ఏడుస్తోన్న జనం బంజర్లు ఏంపెట్టి పండిస్తారు?'' సవాల్ చేసింది ఆత్మ. సవాల్ చేసి వూరుకోలేదు.

''ఓ కరాచీ కాంగ్రెస్ నాటి పాతచింతకాయ పచ్చడీ! యిది పందొమ్మిదివందల ముప్పైలు కాదు, యాభైలు. 'తుస్సు' మని తిప్పడానికి యిది రాట్నంకాదు; తాడూ తంకరాలేని అశోకచక్రం. ఊం, అంటే పరు

గత్తడానికి యిది జైలుకాదు; అధికారపీఠం—” అని విపులంగా బోధపరచింది. ఆత్మ

“అయితే- యీా భారతమాత సుపుత్రులు యిలా తిండికరువుతో తీరిపోవలసిందేనా ?” అంతరాత్మ కళ్లు చెమ్మగిల్లాయి.

“జనాభా తగ్గుతుంది, భూ భారం తీరుతుంది. మంది పల్చనయితే మజ్జిగ చిక్కన అవుతాయి.” అన్నది ఆత్మ.

“హా ! రత్నగర్భా ! అన్నపూర్ణాదేవి ! సుజలాం సుఫలాం ! ప్రపంచ నైతికశిఖరం ! భారత దేశం!...”

—భవిష్యత్ భారత శ్మశానాన్ని తలచుకొని వణికిపోతోంది. అంతరాత్మ

ఆత్మకు కొంచెం జాలికలిగింది.

“...ఇదుగో...హిందువైన ప్రతివాడికీ అతి పవిత్రాలైన, సప్తసంతానాలలో, ఒక్కటైనటువంటి వనప్రతిష్ట ప్రారంభించాం. దానికో వారం పెట్టాం. ఒక్కవారంలో కోటి మొక్కలు...కోటి...” అన్నది ఆత్మ.

అంతరాత్మ చెవులు రిక్కించింది.

"ఈ మహోత్సవం సర్వసంపూర్ణ స్వతంత్ర భారత ప్రథమాధ్యక్షుడు తులసిమొక్క నాటడంతో ప్రారంభమయింది. తులసిమొక్క..."

"తులసిమొక్కా...?"

అంతరాత్మకి అర్ధ నిమీలితాలు పడ్డాయి.

"ఆఁ. తులసిమొక్క."

"తు...లసి... మొ...క్క..." అంటూ గుడ్లు తేలవేసింది అంతరాత్మ. నోరు అలాగే వుండిపోయింది. కాని – గొంతులోని 'గుట గుట' మాత్రం – బధిరశవమైన ఆత్మకూడా స్పష్టంగా వినిపిస్తోంది.

అహింసకు అపరావతారమైన ఆత్మ– ఆఅవస్థని చూడలేకపోయింది. ఎకాయకీ రాజఘాట్‌కు వెళ్ళిపోయింది. అధ్యక్షుడు నాటిన తులసిమొక్కనించి రెండే రెండు ఆకులు తెచ్చింది.

అంతరాత్మ అంగిట్లో తులసితీర్థం కురిసింది. వివిధరాష్ట్ర, కేంద్ర ఆహార నిర్వాహకుల తాలూకు సగటు అంతరాత్మ 'హరీఁ!' అన్నది.

ఆత్మ శనికాస్తా విరగడైపోయింది.

---